# గొప్ప విడుదల
## (ఎస్తేరు గ్రంథం సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** ప్రపంచ చరిత్రను, తన ప్రజలైన ఇశ్రాయేలీయులను తన హస్తాలలో ఉంచుకొన్న దేవుడు, కొంత మంది వ్యక్తులను మరుగున ఉంచి, తన స్వంత సమయంలో తన మహిమార్థం పనిచేసేలా వారి హస్తాలను కదిలించాడు. అలాంటి వారిలో ఎస్తేరు ఒకతి.

**1. గ్రంథకర్త :** ఎస్తేరు గ్రంథాన్ని ఎవరు వ్రాసారో ఖచ్చితమైన ఆధారాలు లేవు. ఎజ్రా అని కొందరు, నెహెమ్యా అని కొందరు, మొర్దెకై అని మరికొందరి అభిప్రాయం. ఏది ఏమైనా గ్రంథ రచనశైలి మరియు సమాచారాన్ని బట్టి ఒక యూదుడు వ్రాసాడని చెప్పవచ్చును.

**2. కాలము :** క్రీ.పూ. 331 సంవత్సరానికి ముందే ఈ గ్రంథం వ్రాయబడిందని చరిత్రకారుల అభిప్రాయం.

**3. సందర్భం :** ఎస్తేరు గ్రంథాన్ని అర్థం చేసికోవాలంటే చరిత్రలోని పలు విషయాలు తెలిసికొని ఉండడం అవసరం.

అ. జెరుబ్బాబెలు నాయకత్వంలో యెరూషలేముకు మొదటి గుంపు తిరిగి వచ్చిన సంవత్సరం క్రీ.పూ. 536.

ఆ. మందిరం క్రీ.పూ. 516లో పూర్తి అయింది.

ఇ. క్రీ.పూ. 578 లో ఎస్తేరు రాణి అయిందిత.

ఈ. క్రీ.పూ. 573 లో తన ప్రజలను రక్షించింది.

ఉ. క్రీ.పూ. 455 లో ఎజ్రా యెరూషలేముకు వచ్చాడు.

ఊ. క్రీ.పూ. 445 లో నెహెమ్యా వచ్చాడు.

చరిత్ర కాలమును బట్టి ఈ సంఘటనలు ఎజ్రా 6వ అధ్యాయానికి మరియు 7వ అధ్యాయానికి గల మధ్య కాలంలో అనగా నెహెమ్యాకు 35 సం॥ల ముందు జరిగినవి. జెరుబ్బాబెలు నాయకత్వంలో 50,000 మంది యెరూషలేముకు తిరిగి వెళ్ళాక, పర్షియా దేశంలో మిగిలి ఉన్న యూదుల చరిత్రను ఈ గ్రంథం తెలియజేస్తుంది.

**4. వ్రాయబడిన ఉద్దేశం :** దేవుని సార్వభౌమాధికారము, దేవుని ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ, శ్రద్ధ, సంరక్షణ ఎంత గొప్పదో, మహామేధావులను సహితం తన స్వాధీనంలో ఉంచుకొని ఏలాంటి పరిస్థితులనైన అవలీలగా మార్చగల దేవుని శక్తి సామర్థ్యాలను లోకానికి

ప్రత్యక్షం చేయడమే ఈ గ్రంథ ముఖ్య ఉద్దేశం. "మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గల 6:7) అనే సత్యాన్ని కూడ ఈ గ్రంథం ప్రబోధిస్తుంది. (ఎస్తే 7:10).

5. **గ్రంథ విశిష్ఠత :** బైబిలులో ఉన్న 66 పుస్తకాల్లో ఎస్తేరు గ్రంథం కొన్ని ప్రత్యేకతలు కలిగి ఉంది. కారణం, ఈ పుస్తకమంతటిలో ఎక్కడా దేవుడు, ధర్మశాస్త్రము, యెరూషలేము, పాలస్తీన, ప్రార్థన అనే మాటలు కనిపించవు. కాని ప్రతి సందర్భంలో పరోక్షంగా దేవుని అదృశ్య హస్తం, ఆయన జోక్యం, దేవుని బిడ్డల ప్రార్థన, దేవుని కాపుదల కనిపిస్తాయి. ఫలితంగా దేవుని ప్రజల విడుదల ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ప్రత్యేకించి మన దేశం పేరు (హిందూ దేశము) వ్రాయబడి ఉండడం ఓ విశేషం.

6. **మూల వచనం :** "నీవు ఈ సమయమునందు ఏమియు మాటలాడక మౌనముగానున్న యెడల యూదులకు సహాయమును విడుదలయు మరియొక దిక్కునుండి వచ్చునుగాని, నీవును నీ తండ్రి యింటి వారును నశించుదురు. నీవు ఈ సమయమును బట్టియే రాజ్యమునకు వచ్చితివేమో ఆలోచించుకొనుము". (ఎస్తే 4:14).

## B. గ్రంథ విభజన :

| | | |
|---|---|---|
| 1. | భర్తకు విధేయత చూపించ నిరాకరించిన భార్య | - 1 అధ్యా |
| 2. | సరైన రాణిని ఎన్నుకొనేందుకు నిర్వహించబడిన అందాల పోటీ | - 2 అధ్యా |
| 3. | హామాను పన్నాగం | - 3 అధ్యా |
| 4. | మొర్దెకై ఎస్తేరును సహాయానికై ప్రేరేపించుట | - 4 అధ్యా |
| 5. | కృప చూపిన రాజదండం మరియు ఘనత నొందిన ఎస్తేరు | - 5 అధ్యా |
| 6. | రాజుకు ఆ రాత్రి నిద్రపట్టక పోవుట | - 6 అధ్యా |
| 7. | విందుకోసం వచ్చి ఉరికొయ్యపై చనిపోయిన వ్యక్తి | - 7 అధ్యా |
| 8. | రాజు నుండి వెలువడిన నిరీక్షణ సందేశం | - 8 అధ్యా |
| 9. | పూరీము పండుగ స్థాపన | - 9,10 అద్యా |

## C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

1. **చరిత్ర :** క్రీ.పూ. 486-465 లో పర్షియా మహా సామ్రాజ్యానికి అహష్వేరోషు చక్రవర్తిగా ఉన్నాడు. ఇతడు ఎజ్రా, నెహెమ్యాలు యెరూషలేముకు వెళ్ళడానికి అనుమతినిచ్చిన అర్తహషస్తకు తండ్రి. దానియేలు కాలంలో పర్షియాకు చక్రవర్తిగా ఉన్న దర్యావేషుకు కుమారుడు. ఇతని గూర్చి చరిత్రలో అనేక విషయాలు వ్రాయబడ్డాయి. అతని సామ్రాజ్యం

తూర్పున హిందూ దేశం నుండి దక్షిణాన కూషు దేశం వరకు 127 సంస్థానాలుగా విస్తరించింది. చరిత్ర పుస్తకాల్లో ఇతని పేరు Xerxes అని వ్రాయబడింది.

2. **అహష్వేరోషు విందు :** ఎస్తేరు గ్రంథం అహష్వేరోషు విందుతో ఆరంభమై మొర్దెకై విందుతో ముగించబడింది. అహష్వేరోషు పారసీక, మాదీయ దేశాల పరాక్రమశాలురను, సంస్థానాధి పతులనందరినీ ఆహ్వానించి దాదాపు 6 మాసాల పాటు తన రాజ్య ఐశ్వర్య ప్రభావాన్ని, తన మహాత్యాతిశయ ఘనతలను ప్రదర్శిస్తూ వచ్చాడు. ఆ సందర్భంగా రాజస్థితికి తగినట్టు 7 రోజులు గొప్ప విందు చేయించాడు. చివరిరోజు తన భార్య, పట్టపురాణి అయిన వష్తి అందాన్ని అక్కడ చేరినవారందరికీ చూపించాలనుకున్నాడు. అందుకు వష్తి యిష్టపడనందు వల్ల కోపిష్ఠియైన, చంచల స్వభావంగల రాజు వెంటనే తన ఏడుగురు సలహాదారులను సమావేశపరచి, రాణి విషయం ఏలాంటి చర్య తీసికోవాలి అని ప్రశ్నించాడు. రాణి ప్రవర్తనను బట్టి రాజ్యంలోని స్త్రీలంతా తమ భర్తలను చులకనగా చూస్తారు గనుక ఆమెను విడిచిపెట్టి, ఆమె కంటె యోగ్యురాలిని రాణిగా చేయాలని వారు సలహా ఇచ్చారు. దానికి అహష్వేరోను అంగీకరించాడు. ప్రతి యింటిలోను స్త్రీలు పురుషుల మాటకు లోబడాలని దేశమంతా చాటించాడు. ఇదంతా క్రీ.పూ. 483లో జరిగినట్లు చరిత్రలో ఆధారాలున్నాయి.

3. **వష్తి నిష్క్రమణ ఎస్తేరు ప్రవేశం :** అహష్వేరోషు జీవితంలో అతని భార్యయైన వష్తి నిష్క్రమణకు, ఎస్తేరు ప్రవేశానికి మధ్య నాలుగు సంవత్సరాల వ్యవధి ఉండినది. ఈ మధ్య కాలంలో జరిగిన విషయాలు ఇవి.

క్రీ.పూ. 480 సంవత్సరం వసంతకాలంలో రాజైన అహష్వేరోషు 1,00,000 సైన్యంతో వందలాది నౌకలలో గ్రీసు దేశంపైకి యుద్ధానికి బయలు దేరాడు. వారు సముద్రంలో ప్రయాణం చేస్తూ ఉండగా, తుఫానులో 400 నౌకలు బ్రద్దలైపోయాయి. దిక్కుతోచని రాజు, తన బెల్టుతో నీళ్ళను కొట్టి తన కోపాన్నంతా వెళ్ళగ్రక్కాడు.

వారు గ్రీసు దేశంలోనికి ప్రవేశించాక, వెంటనే యుద్ధం చెయ్యకుండ ఒక రోజంతా పర్వత ప్రాంతంలో నిలిచిపోయారు. దాన్ని అదనుగా తీసికొని గ్రీకు సైన్యాధిపతి, 300 మంది ధైర్యశాలురైన సైనికులతో గర్విష్ఠులైన పారసీక సైనికులను అడ్డగించి, 24 గంటలు అక్కడే నిలిపివేసాడు, వారికి తీవ్ర నష్టాన్ని కలిగించాడు తుదకు అహష్వేరోషు దేశంలోనికి చొచ్చుకొని పోయి ఏథెన్స్ పట్టణాన్ని నేలమట్టం చేసి భస్మం చేసాడు. అయితే అందలి పౌరులు చాలమంది తప్పించుకొని సలమీ అనే ద్వీపానికి పారిపోయారు. అలా పారిపోయిన వారి సంఖ్యను, తన సైన్యాన్ని అంచనా వేసికొని, తన సైన్యం వారి కంటె మూడు రెట్లు ఎక్కువగా ఉందన్న ధీమాతో అహష్వేరోషు వెంటనే సలమీ ద్వీపంలోనికి ప్రవేశించాడు. కాని అతి వేగంగా ప్రయాణం చేసే గ్రీకు యుద్ధ నౌకలు కనురెప్పపాటులో వారిని చుట్టు

ముట్టి దాడి చేసాయి. ఆశ్చర్యాందోళనలో నుండి తేరుకొనే లోపే అహష్వే రోషు సైన్యం అతని కళ్ళ యెదుటనే వధించబడింది.

ఘోరాపజయం పాలైన అతడు పారసీక దేశానికి తిరిగి వచ్చాడు. ఒక సంవత్సరానంతరం, అనగా క్రీ.పూ. 479 సం॥ మిగిలిన కొద్ది సైన్యానికి అధిపతిగా ఉన్న నార్డోనియస్ మరో యుద్ధంలో ఓడిపోయి, చంపబడ్డాడు. అదే పారసీక దేశానికి చివరి చావు దెబ్బ అని చెప్పవచ్చును. ఓవైపు గ్రీకుల చేతిలో ఓటమి పాలై, మరో వైపు రాణియైన వష్తి వియోగంతో ఉన్న సమయంతో, అనగా అహష్వేరోషు పరిపాలనలో 7వ సంవత్సరంలో ఎస్తేరు ప్రవేశించింది.

4. **ఎస్తేరు :** ఓవైపు యుద్ధంలో ఓడిపోయి, మరోవైపు భార్యను కోల్పోయిన అహష్వేరోషును ఓదార్చేందుకు క్రొత్త రాణిని వెదికే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాజ్యంలోని సౌందర్యవంతులైన కన్యకలు ఒక చోట సమకూర్చబడ్డారు. (2:1-4). ఈ విధంగా సమకూర్చబడిన కన్యకలలో యూదురాలైన హదస్సా ఉంది. హదస్సా అన్న మాటకు అర్థం గొంజి చెట్టు. ఇది వృక్ష జాతిలో బహుచిన్నది. 7,8 అడుగుల కన్న ఎక్కువ ఎత్తు ఎదుగదు. చెట్టు చిన్నదే అయినా, మంచి ఔషద గుణాలున్నది. గొంజి చెట్టు లాంటి సామాన్య అనాథ బాలికయైన హదస్సాను దేవుడు ఎస్తేరుగా (నక్షత్రంగా) మార్చి దుఃఖాంధకారంలో మునిగిపోయిన ప్రజల మధ్య ప్రకాశింపజేసాడు.

ప్రియ పాఠకులారా! మన జీవితాలు కొన్ని పర్యాయాలు ఎన్నిక లేనివిగా, అల్పమైనవిగా కనిపించవచ్చును. మన జీవితాలపట్ల దేవుని ప్రణాళిక ఎంటో, మన ద్వారా ఈలోకంలో ఆయన ఏమి జరిగించాలని కోరుకుంటున్నాడో మనకు అర్థంకాదు. కాని దేవుడు మన జీవితాల్లో అనుమతించిన ప్రతి పరిస్థితిని సంతోషంగా స్వీకరిస్తే, గొంజిచెట్టులా ఉన్న మన జీవితాలు నక్షత్రాల వలె మారిపోతాయి. ఎవరికీ, ఎందుకు పనికిరాము అనుకొంటున్న మనల్ని దేవుడు అనేకులకు ఆశీర్వాదకరంగా చేస్తాడు. కనుక అన్ని విషయాలలో దేవునికి విధేయత చూపిద్దాం.

ఎస్తేరు, నెబుకెద్నెజరు కాలంలో బబులోనుకు చెరగొనిపోబడిన మొర్దెకై అనే యూదునికి పెంపుడు కుమార్తె (2:5-7). సమకూర్చబడిన ప్రతి కన్యక 12 మాసాల పాటు సిద్ధపర్చబడిన తరువాత రాజు దగ్గరికి పంపించబడింది. ఎస్తేరు ఎవరి ఆధీనంలో ఉంచబడిందో ఆ హేగే హృదయాన్ని దేవుడు తెరిచాడు. ఎస్తేరుపట్ల అతనికి దయ కలిగించాడు. (2:9,10). ఎస్తేరు యూదురాలు అని తెలియకుండ ఆమె మరియు మొర్దెకై జాగ్రత్త వహించారు.

రాజు వద్దకు పంపించబడిన కన్యకలంతా అతనికి ఉపపత్నులుగా ఎంచబడ్డారు. కాని ఎస్తేరు జీవితం పట్ల దేవునికి గల ఉన్నతమైన ఉద్దేశం ప్రకారం అహష్వేరేషు రాజుకు

ఆమె పట్ల ప్రేమను, దయను కలిగించాడు (2:16,17). ఈ విధంగా దేవుని నిర్ణయం చొప్పున క్రీ.పూ. 479 సం॥ ఆమె రాణిగా చేయబడింది. ఎస్తేరు అంతగా హెచ్చింబడ్డానికి కారణం దైవ సంకల్పమే అయినా ఆమె గుణలక్షణాలు కూడ అందుకు దోహదపడ్డాయని చెప్పవచ్చును. ఎస్తేరు కృత్రిమ అలంకరణ కంటే తన ఆధ్యాత్మిక, అంతరంగిక స్వభావముతో రాజును ఆకర్శించగలిగింది. (I పేతు 3:374). కనుక దేవుని మెప్పును, మనుష్యుల మెప్పును పొందగలిగింది.

తనను పెంచిన మొర్దెకైకి సంపూర్ణ విధేయత చూపించింది. అతడు చేసిన మేలును మరచిపోలేదు. తన హోదాను బట్టి అతని మాటల్ని నిర్లక్ష్యం చేయలేదు. మొర్దెకై కూడా మునుపటిలాగే ఎస్తేరు పట్ల శ్రద్ధ చూపిస్తూ వచ్చాడు (2:11).

ఎస్తేరు మొర్దెకై పోషణలో ఉన్నప్పుడు ఎలా లోబడుతూ వచ్చిందో ఇప్పుడు కూడ అతని మాటకు లోబడింది (2:20). మరో ముఖ్యమైన విషయం ఏమంటే తనకు ఇవ్వబడిన ఉన్నత స్థానాన్ని అదనుగా తీసికొని తన స్వంత ప్రజలకు రాజు ఆస్థానంలో పదవులు కల్పించడం వంటిదేమి చేయలేదు. చివరికి తనను పెంచిన మొర్దెకైకి సహితం పదోన్నతి కల్పించలేదు. దేవుని సమయం కొరకు వేచి వుంది. మొర్దెకై సలహా ప్రకారం పని జరిగించేందుకు ఎస్తేరు తన ప్రాణాన్ని సహితం లెక్కచేయలేదు (4:16).

5. **మొర్దెకై రాజు ప్రాణాన్ని కాపాడుట (2:21-23) :** ఎస్తేరు మొర్దెకైకి పినతండ్రి కూతురు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆమెను మొర్దెకై తండ్రిగా చేరదీసి తల్లిలా ఆదరించి దైవభక్తితో పెంచి పెద్దచేసాడు. ఇతడు తన దైవానికి మినహా మరే మానవునికి తల ఒగ్గని నిష్ఠాగరిష్ఠుడైన యూదుడు, బహు భక్తి పరాయణుడు. రాజు ద్వార పాలకుల్లో యిద్దరు రాజుకు వ్యతిరేకంగా కుట్ర పన్నిన విషయాన్ని మొర్దెకై ఎస్తేరుకు తెలియజేసాడు. ఎస్తేరు ఆ విషయాన్ని రాజుకు తెలియజేసింది. రాజు విచారించి తెలిసికొని ఆ ద్వారపాలకులనిద్దర్నీ ఉరి తీయించాడు. ఈ విధంగా మొర్దెకై రాజు ప్రాణాన్ని కాపాడం కూడ దేవుని కార్యంలో ఒక భాగమే, ఇతడు చేసిన దానిని గూర్చి రాజ్య సమాచార గ్రంథంలో వ్రాయబడింది.

6. **యూదుల నిర్మూలనకు హామాను పన్నాగం (3:1-4:17) :** రాజైన అహష్వేరోషు ఆస్థానంలో రెండవ స్థానంలో ఉన్న ప్రధాన మంత్రి హామాను అమాలేకీయుల రాజైన అగగు వంశస్తుడు (నిర్గ 17:16). యూదుల పట్ల శత్రుభావంగల అగగు వంశస్తుడవడమే కాక సహజంగా అతనిలో ఉన్న పదవీ వ్యామోహం, జాతి ద్వేషం మొర్దెకైని ద్వేషించడానికి అంతర్గత కారణాలయ్యాయి. మొర్దెకై హామానకు నమస్కరించక పోవడమే అతని పగకు కారణం. అతనితోపాటు అతని జాతినంతా నాశనం చేయాలని సంకల్పించాడు. యూదులు రాజుకు వ్యతిరేకులని, రాజాజ్ఞలను గైకొనరని, వారిని నాశనం చేయడం రాజుకు, రాజ్యానికి

క్షేమమని రాజుకు నూరి పోసాడు. యూదుల్ని హతమార్చేందుకు రాజు అనుమతిని సంపాదించాడు. నిర్ణీత దినాన పర్షియా సామ్రాజ్యంలోని అన్ని సంస్థానాలకు తాకీదు వ్రాయించి రాజు ఉంగరం చేత ముద్రించి పంపించాడు యూదుల వధకు హామాను నిర్ణయించిన తేదీ క్రీ.పూ. 473 సం॥ మార్చి 7వ తేదీ. దుర్మార్గుడైన హామాను మొర్దెకైని ఉరి తీసేందుకు, తన భార్య మరియు స్నేహితుల సలహా మేరకు పెద్ద ఉరికంబాన్ని కూడ చేయించాడు. అయితే చివరికి తాను త్రవ్వుకున్న గోతిలో తానే పడ్డాడు. రాజ్య ప్రజలందరి సమక్షంలో గొప్ప అవమానానికి, సంక్షోభానికి గురయ్యాడు. స్వార్థంతో, దురుద్దేశంతో దుస్సాహసానికి ఒడిగట్టే వారందరూ ఘోరాపజయం పాలౌతారని హామాను జీవితం బోధిస్తుంది. ఇతరులందర్నీ తన స్వాధీనంలో ఉంచుకొని, తాను మాత్రమే అధికారాన్ని గౌరవాన్ని పొందాలన్న తపన, యూదుల వల్ల తన అధికారానికి భంగం కలుగుతుందన్న భయం, అధికార దుర్వినియోగం అతని పతనానికి కారణమయ్యాయి. కుటుంబ యజమాని దుర్మార్గాన్ని అనుసరించడం వలన కుటుంబమంతటికి ముప్పు వాటిల్లుతుంది. అతని భార్య కూడ అతని దుష్టత్వంలో పాలిభాగస్తురాలు కావడం శోచనీయం. తత్ఫలితంగా హామాను తోపాటు అతని 10 మంది కుమారులు కూడ చంపబడ్డారు (7:10; 9:7-9). అతని ఆస్తంతా ఎస్తేరుకు ఇవ్వబడింది (8:1).

7. **మొర్దెకై సత్వర ప్రతిస్పందన (4 అధ్యా) :** హామాను కుట్రను బట్టి షూషను కోటలో గొప్ప కలవరం ప్రారంభమైంది మొర్దెకై రాజుచే ఇవ్వబడిన ఆజ్ఞను విని వెంటనే తన ప్రజలైన యూదులతోపాటు తాను కూడ దుఃఖంలో మునిగిపోయాడు. మొర్దెకై నుండి విషయాన్ని తెలిసికొన్న ఎస్తేరు ఆశ్చర్యపోయింది. రాజు దగ్గరకు వెళ్ళి యూదుల పక్షంగా రాజును వేడుకోవల్సిందిగా మొర్దెకై ఎస్తేరుకు సలహా ఇచ్చాడు. కాని రాజు అనుమతి లేనిదే చివరికి రాణిసైతం రాజు సన్నిధిలో ప్రవేశించేందుకు వీలు లేదు గనుక ఎస్తేరు తన నిస్సహాయ స్థితిని తెలియజేసింది అప్పుడు మొర్దెకై చెప్పిన మాటలు ఎస్తేరును సవాలు చేసాయి. (4:13,14) అందులో రెండు మాటలు ప్రాముఖ్యమైనది. ఒకటి "నీవు ఈ సమయమునందు ఏమియు మాటలాడక మౌనముగానున్న యెడల, యూదులకు సహాయమును విడుదలయు మరియొక దిక్కు నుండి వచ్చును". రెండవది "నీవు ఈ సమయమును బట్టియే రాజ్యమునకు వచ్చితివేమో ఆలోచించుకొనుము". ఈ మాటలు ఎంతైన వాస్తవమైనవి. కొన్ని పర్యాయాలు దేవుని పక్షంగా, దేవుని కార్యాలు చేయడానికి తగిన స్థానంలో మనం లేకున్నా, ఆలాంటి వారిని ప్రోత్సహించి, పురికొల్పి సవాలు చేయడం ద్వారా మన స్వంత ప్రజలకు మేలు కలిగించవచ్చు. ఉపాధ్యాయులుగా, నర్సులుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రభుత్వాధికారులుగా పని చేస్తున్న క్రైస్తవ విశ్వాసులను సమాజ వికాసం కోసం

వినియోగించుకోవచ్చును. వారిలో ఆలాంటి దర్శనాన్ని ప్రేరణను కలిగించవచ్చును. విశ్వాసులు లోకవ్యవస్థలో అన్ని రంగాలలోను ప్రధాన పాత్రను వహించి దేవుణ్ణి మహిమ పర్చడమే కాక సహ విశ్వాసులకు తమవంతు సహకారాన్ని అందించవచ్చు. ఎస్తేరు పర్షియాలోనున్న తన ప్రజలను రక్షించుకోవడం మాత్రమే కాకుండ అటు పిమ్మట తన సవితి కుమారుడైన అర్తహషస్త కాలంలో ఎజ్రా, నెహెమ్యాలకు అనుమతి లభించేలా చేసి పాలస్తీనలో నున్న యూదులకు కూడ సహాయం చేసింది.

8. **ఎస్తేరు సత్వర ప్రతిస్పందన :** దేవుడు మనల్ని ఒక స్థానంలో ఉంచాడు. అంటే అదేదో యదృచ్ఛికంగా జరిగే విషయం కాదు. తప్పకుండ ఓ ఉద్దేశంతోనే ఉంచుతాడు. కనుక దేవుని చిత్తాన్ని గ్రహించి, లోబడి ఆయన చేతి సాధనంగా వాడబడమే ధన్యకరం. మనం వాడబడకుంటే దేవుని పని ఆగిపోదు సుమా! దేవుడు మరొకర్ని వాడుకుంటాడు. కాని మన జీవిత ఉద్దేశం వ్యర్థమౌతుంది. మొర్దెకై మాటల భావం అదే. ఎస్తేరు ఆలోచించింది. దేవుని వైపు చూచింది. ఒక తీర్మానం చేసుకుంది (4:15-16) తన ప్రజల రక్షణ నిమిత్తం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయలేదు. దేశంలోని యూదులందర్నీ ఉపవాసం ఉండాల్సిందిగా మొర్దెకై ద్వారా ఆజ్ఞాపించింది. తాను తన పనికత్తెలు కూడ 3 రోజులు ఉపవాసముంది దేవుని సన్నిధిలో ప్రలాపించారు. మూడు రోజుల అనంతరం రాజు పిలవకుండానే రాజు సన్నిధికి వెళ్ళింది. దేవుడు రాజుకు ఎస్తేరు పట్ల దయపుట్టించాడు (5:2-3). అహష్వేరోషు ఎస్తేరు తట్టు తన బంగారు దండాన్ని చాపడమే కాక "నీ కోరిక ఏమిటి? రాజ్యంలో సగం కావాలన్నా ఇస్తాను" అని అన్నాడు. ఎస్తేరు ఎంతో జ్ఞానంతో ప్రవర్తించింది. వెంటనే అసలు విషయాన్ని చెప్పకుండ రాజును, హామానును మరుసటి రోజు తాను ఏర్పాటు చేయనైయున్న విందుకు ఆహ్వానించింది.

రాణి రాజుతోపాటు తనను మాత్రమే ఆహ్వానించినందుకు హామాను గర్వించాడు సంతోషించాడు కాని మొర్దెకైపట్ల పగ ఎక్కువైంది. తన భార్య, స్నేహితుల సలహామేరకు ఒక ఉరికొయ్యను అతని కోసం సిద్ధపర్చాడు. ఓవైపు శత్రువు పనిచేస్తూ ఉండగా మరోవైపు దేవుడు పని చెయ్యడం ఆరంభించాడు. ఆ రాత్రి రాజుకు నిద్రపట్టకపోవడం, రాజ్యసమాచార గ్రంథం చదవడం మొర్దెకై రాజు ప్రాణాన్ని కాపాడిన వృత్తాంతం తెలిసికోవడం, మరుసటి రోజు అతన్ని సత్కరించడం వీటన్నిటి వెనుక గల దేవుని అదృశ్య హస్తాన్ని మనం చూడగలం. రాజు సత్కరించగోరిన వారికి ఏమి చెయ్యాలని ప్రశ్నించినప్పుడు హామాను తనను గూర్చే అనుకొని ఆ వ్యక్తికి రాజ వస్త్రాలు ధరింపజేసి రాజు గుర్రం మీద ఎక్కించి, రాజు కిరీటాన్ని ధరింపజేసి ఊరేగించాలని చెప్పాడు. అలా అయితే మొర్దెకైని అలా సన్మానించమని రాజు ఆజ్ఞాపించాడు. హామాను సంతోషం కాస్త దుఃఖంగా మారిపోయింది (6:12-13).

**9. ఎస్తేరు విందు :** అహష్వేరోషు, హామాను ఎస్తేరు ఏర్పాటు చేసిన విందుకు 3వ రోజు కూడ వెళ్ళారు. రాజు మరలా "ఎస్తేరు! నీ మనవి ఏమిటి? రాజ్యంలో సగం వరకైనా నీకు ఇస్తాను" అని వాగ్దానం చేసాడు. అప్పుడు ఎస్తేరు తన జనుల విషయం రాజుతో మనవి చేసింది. తన ప్రాణాన్ని తన జనుల ప్రాణాల్ని కాపాడాలనికోరింది.

ఇక్కడ ఓ విషయాన్ని గమనించాలి. అహష్వేరోషు పరిపాలనలో 7వ సంవత్సరంలో ఎస్తేరు రాణిగా చేయబడింది. (2:16,17). 12వ సంవత్సరంలో హామాను కుట్ర చేసాడు. అనగా 5 సం॥లు కూడ, మొర్దెకై సలహా మేరకు ఎస్తేరు రాజుతో తన జాతినిగాని వంశాన్ని గాని తెలియజేయలేదు. మొర్దెకై ఈ విషయాన్ని గుప్తంగా ఉంచాలని చెప్పడంలో అంతరార్థం మనకు తెలియదు గాని, తగిన సమయం వచ్చినప్పుడు రాజుతో ధైర్యంగా ఈ విషయాన్ని చెప్పి, తన ప్రాణాన్ని తన ప్రజల ప్రాణాన్ని కాపాడమని అర్థించడం ముదావహం. అలా తెలియజేయడంలో తన ప్రాణాలకే ముప్పు లేకపోలేదు. కాని ఎస్తేరు ఇక దాచిపెట్టలేక పోయింది. తాను ఎవరో, ఏ జాతికి చెందినదో ఒప్పుకొన్నది. అలా ఎప్పుడైతే తాను జీవముగల దేవుని బిడ్డ అని ఒప్పుకొని దేవుణ్ణి ఘనపర్చిందో, అప్పుడు దేవుడు ఆమెను ఆమె జాతిని ఘనపర్చాడు ప్రియ సోదరా! సోదరీ! మీలో కొంత మంది ఈలాంటి స్థితిలో ఉండవచ్చును. కొంత మంది క్రీస్తులో తమ విశ్వాసాన్ని గూర్చి ఇతరులకు చెప్పకుండ రహస్య క్రైస్తవులుగా ఉన్నారేమో! చివరికి తమ జీవిత భాగస్వామికి కూడ తెలియకుండ రహస్యంగా ఉన్నారేమో! తద్వారా కలిగే కష్టాలు, శ్రమలను గూర్చి లేక కోల్పోయే ఆధిక్యతలను గూర్చి భయపడుతున్నారేమో. కాని మీకు ఓ విషయం తెలుసా? మనం ప్రభువును ఘనపరిస్తే ప్రభువు మనల్ని ఘన పరుస్తాడు (I సమూ 2:30; మత్త 10:32) కొన్ని పర్యాయాలు అలా ఒప్పుకోవడం ద్వారా కొన్ని ఆధిక్యతలను పోగొట్టుకోవలసి వచ్చినా, దానికి రెట్టింపుగా పొందుతామని కూడ ప్రభువు వాగ్దానం చేసాడు. (మత్త 19:29).

రాజు ఆ కార్యానికి తలపడిన వారెవరని ప్రశ్నించాడు. ఎస్తేరు హామాను గూర్చి చెప్పింది (7:5-7). రాజు కోపంతో అక్కడి నుండి వెళ్ళిపోయాడు. హామాను భయంతో రాణిని బ్రతిమాలేందుకు వచ్చాడు; రాజు మరలా రాణి మందిరంలోనికి అడుగుపెట్టేసరికి త్రాగిన మైకంలో ఉన్న హామాను ఎస్తేరు శయ్య చివర్నపడి ఉండడం చూసిన రాజు కోపం తారస్థాయికి చేరుకుంది (7:8-10) రాజునోట నుండి మాట వచ్చిన వెంటనే బంటులు హామాను ముఖానికి ముసుగు వేసారు. హామాను మొర్దెకై కోసం సిద్ధం చేసిన ఉరికొయ్యపైన హామానే ఉరి తీయబడ్డాడు. అంతటితో హామాను చరిత్ర ముగిసింది. "నిన్ను దీవించువారిని దీవిస్తాను నిన్ను శపించువారిని శపిస్తాను. (ఆది 12:3) అని దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానాన్ని హామాను గ్రహించలేదు. "గుంటను త్రవ్వువాడే దానిలో పడును" (సామె 26:27)

"మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గల 6:7) అన్న సత్యం అతని పట్ల అక్షరాల నెరవేరింది. "నీకు విరోధముగా రూపించబడిన యే ఆయుధమును వర్ధిల్లదు" (యెష 54:17) అన్న వాగ్దానం ఎంతైనా సత్యం. దేవుడు తాను ఏర్పరచుకొన్న ప్రజలను ఎలా సంరక్షించగలడో చరిత్రలో అనేకులు తెలిసికొన్నారు. దేవుని ప్రజలు సముద్రంలో మునిగిపోలేరు అని ఫరో తెలిసికొన్నాడు (నిర్గ 14). వారు అగ్నిలో కాల్చబడరు అని నెబుకద్నెజరు తెలిసికొన్నాడు (దాని 3 అధ్యా) వారిని సింహాలు మ్రింగివేయలేవని దర్యావేషు తెలిసికొన్నాడు (దాని 6 అధ్యా) వారిని ఉరి తీయలేమని హామాను తెలిసికొన్నాడు.

అహష్వేరోషు హామాను ఆస్తిపాస్తులను, హామాను ఇంటికి ఎస్తేరుకు బహుమానంగా ఇచ్చాడు. రాజుకు మేలు చేసిన మొర్దెకైని పర్షియా రాజ్యానికి ప్రధానిగా నియమించాడు.

10. **దేవుని ప్రజల విజయం - శత్రువు అపజయం (8:4-10:3) :** శత్రువైన హామాను చనిపోయాడు గాని అతడు పంపించిన తాకీదులు పర్షియా రాజ్యంలోని అన్ని సంస్థానాలకు చేరాయి. కనుక ఆ తాకీదులను రద్దు చెయ్యాల్సిందిగా ఎస్తేరు రాజును బ్రతిమాలుకుంది.

    రాజుపేరిట ముద్రించబడిన తాకీదును రాజు కూడ రద్దు చేసేందుకు వీలులేదు. అందుచేత అహష్వేరోషు యూదుల పక్షంగా మరో తాకీదు వ్రాయించి పంపించమని చెప్పాడు. క్రీ.పూ. 474 సం॥ జూన్ మాసం 25వ తేదీన రాజు యొక్క వ్రాత గాండ్రు పిలువబడ్డారు. (8:9) మొర్దెకై యూదుల పక్షంగా మరో తాకీదు వ్రాయించి రాజు ఉంగరం చేత ముద్రించి రాజు బీజాశ్వాల మీద అంచెగాండ్ర ద్వారా తాకీదును అన్ని సంస్థానాలకు పంపించాడు. యూదులను చంపడానికి హామాను నిర్ణయించిన దినమందే, యూదులందరు తమ ప్రాణ రక్షణకోసం శత్రువులను చంపాలన్నదే ఆ తాకీదులోని సందేశం. (8:11-12). యూదులకు గొప్ప ఆనందం, శత్రువులకు భయం పుట్టుకొచ్చింది. నిర్ణయించబడిన దినాన యూదులు తమ శత్రువులందరినీ, హామాను 10 మంది కుమారుల్ని చంపివేసారు. అలా రెండు రోజులు యూదులు తమ శత్రువులను హతమార్చేందుకు ఎస్తేరు రాజుచే అనుమతి పొందింది. (9:16) మరుసటి రోజు కూడ యూదులు 75,000 మందిని చంపారు.

11. **పూరీము పండుగ :** హామాను యూదుల్ని హతమార్చేందుకు ఒక చీటీ ద్వారా ఒక దినాన్ని నిర్ణయించాడు. అదే దినాన దేవుడు పరిస్థితులను తారుమారు చేసి యూదుల శత్రువులను వారి చేతికి అప్పగించాడు గనుక యూదులంతా ఆ దినాలకు పూరీము (అనగా చీటి అని అర్థం) అని పేరు పెట్టుకొని వాటిని పండుగగా ఆచరించారు. ఈ పూరీము పండుగ ఈ నాటికీ ఇశ్రాయేలు దేశంలోని యూదులు ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటారు.

దేవుని ప్రజలు దేవుణ్ణి మరచిపోయినప్పుడు, దేవుడు వారిని తిరిగి తనవైపు త్రిప్పుకోడానికి కొంతకాలం మట్టుకు శత్రువులకు, తెగుళ్ళకు, కష్టాలకు వారిని అప్పగించినా ఆయన ప్రేమలో మాత్రం ఏమార్పు లేదు. తిరిగి వారిని సమకూర్చేందుకు కూడ ఆయన ప్రణాళికను సిద్ధంచేసుకుంటాడు. వారి శత్రువులను సహితం తన సాధనాలుగా మలచుకోగలడు. అంత మాత్రమే కాదు తన ప్రజల్ని గుణపరచేందుకు వారి హస్తాలకు అప్పగించినప్పుడు వారు తన ప్రజల పట్ల మితిమీరి వ్యవహరించిన విధానాన్ని ఆయన చూస్తూ ఊరుకోడు సుమా! అందుకు తగిన శిక్ష వారికి కూడ విధిస్తాడు.

ఎస్తేరు గ్రంథంలో దేవుని ప్రజల్ని నాశనం చేయాలని జరిగిన కుట్ర అనంతరం 1400 సంవత్సరాలకు 20వ శతాబ్దంలో రష్యాలో ఆలాంటి సంఘటననే జరగడం మనందరికీ విదితమే. 60 లక్షల యూదుల మారణహోమం అనంతరం ఎనిమిది సంవత్సరాల తరువాత సోవియట్ యూనియన్‌లోని 30 లక్షల మంది యూదులను కూడ నామరూపాలు లేకుండా అంతమొందించాలని జోసఫ్ స్టాలిన్ 1953 సం॥ మార్చి 1వ తేదీన ప్రకటించాడు. సోవియట్ యూనియన్‌లోని ఈ మారణ హోమం మార్చి 9వ తేదీ జరగాలని నిర్ణయించబడింది. కాని అలా జరగలేదు. కారణం, దీన్ని అమలు పర్చాలని నిర్ణయించి ప్రకటించిన మరునాడే స్టాలిన్ గుండెపోటుతో మరణించాడు. ప్రారంభంలో ఇది ఓ పుకారులా వ్యాపించినా, వాస్తవికంగా జరిగిన ఈ సంఘటన పూర్వపరాలు ఈ విధంగా ఉన్నాయి. లుద్మిలా లుఫానోవ్ అనే ఒక యూదేతర మహిళ ద్వారా ఈ నిజం వెలుగులోనికి వచ్చింది. ఈమె సోవియట్ దేశానికి సంబంధించిన అతి రహస్య దస్తావేజులుంచబడే కార్యాలయంలో అనగా మాస్కోలో అనేక సంవత్సరాలు పనిచేసింది. తరువాత ఆ దేశాన్ని విడిచి అమెరికా దేశానికి వెళ్ళింది. కొంత కాలం క్రితం సోవియట్ రష్యా భాషలో ప్రచురించబడిన ఒక పత్రికలో ఆమె స్టాలిన్ ఘోరకృత్యాన్ని గూర్చి చెప్పిన విషయాలు పేర్కొనబడ్డాయి. దాని నకలు ఒకటి యెరూషలేములోని యూదా ముద్రణాలయానికి చేరుకుంది.

యూదుల వల్ల తనకు ముప్పు కలుగుతుందని ఊహించుకొని, వారిని ద్వేషించిన స్టాలిన్ 1930 సం॥ లక్షలాది మంది యూదులను సంహరించాడు. చంపబడిన వారిలో బోల్షెవిక్ ఉద్యమంలో నమ్మకంగా తనకు అండగా నిలిచిన కామ్రేడ్‌లు కూడ ఉన్నారు. తన భయాన్ని బట్టి అతడు సామాన్య యూదా సమాజాధికారులందర్ని కూడ హతమార్చాడు. ప్రపంచ యుద్ధానంతరం, ఇశ్రాయేలు దేశం నుండి మాస్కోకు పంపించబడిన మొదటి రాయబారి గోల్డా మేయరును సోవియట్‌లో యూదులు స్వీకరించిన విధానం స్టాలిన్‌ను మరింత కోపోద్రేకుణ్ణి చేసాయి. వెంటనే రంగంలోనికి దిగాడు. యూదులలో కవులను,

రచయితలను, కళాకారులందర్నీ చంపేసాడు. తన ఆధిపత్యంలో ఉన్న దేశాలన్నీ ఈలాగే చెయ్యాలని జ్ఞాపించాడు. అతని ఆజ్ఞమేరకు జరిగిన మారణ హోమంలో జెకొస్లావేకియా కమ్యూనిటీ పార్టీ అధినేత మరియు స్టాలిన్ నమ్మకమైన బంటుయైన స్లాంకీ మరియు ఉన్నతాధికారులైన యూదులనేకులు ఉరితీయబడడం ప్రపంచాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. అయితే "వైద్యులకుట్ర" అనే నెపంతో స్టాలిన్ వేసిన నాటకంతో యూదా జాతిమేధానికి తెరపడింది. 1953 సంIIలో స్టాలిన్ వైద్యులైన యూదులు కొందరు తనను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని అకస్మాత్తుగా ప్రకటించాడు. అన్ని వార్తాపత్రికల్లోని మొదటి పేజీలో "కుట్రదారులు" – "కుట్ర" అన్న వార్త ముద్రించబడింది. ఈ విషయాన్ని చర్చించేందుకు సోవియట్ యూనియన్‌లోని కమ్యూనిస్టులందరూ సమావేశమయ్యారు. వాస్తవానికి వారి చర్చనీయాంశం యూదులే, కాని వారు దానికి కాస్మొపొలిటిజమ్ అని జయనిజమ్ (Zionism) అని పేరు పెట్టుకొన్నారు. వాస్తవానికి ఇదంతా స్టాలిన్ కుట్రనే. తనను వైద్యులైన యూదులు చంపాలనుకొంటున్నారు అన్న నెపంతో ఆ వైద్యులను చంపేస్తే జరిగే స్థానికి అలజడులలో యూదులందరూ చంపబడాలని అతని ప్రణాళిక.

1953 సంII మార్చి 1వ తేదీ సోవియట్ నాయకులందర్ని సమావేశ పరచి రహస్య పరిభాషలో తన ప్రణాళికను ఇలా వివరించాడు. "వైద్యులైన యూదులు నన్ను చంపాలను కొన్న నేరాన్ని ఒప్పుకొంటారు. వారు బహిరంగముగా ఉరితీయబడతారు. అయినా ప్రజలు తృప్తి చెందరు, వారి నైతిక కోపాన్ని వెల్లడిస్తూ దేశంలో అల్లర్లు సృష్టిస్తారు అలా మూడు రోజులు జరిగాక యూదుల అధికారులు, రష్యా ప్రజల పట్ల తాము తప్పు చేసామని ఒప్పుకుంటు, తమను కాపాడమని వ్రాతపూర్వకంగా ప్రభుత్వానికి వినతి పత్రాన్ని సమర్పిస్తారు. అప్పుడు ప్రభుత్వం ప్రజలలో నుండి యూదులందర్నీ ప్రత్యేకపరచి, ప్రత్యేక రైళ్ళలో వారిని సైబీరియా ప్రాంతానికి పంపించే ఏర్పాటు చేస్తుంది. కాని వారిలో 1/3 వంతు యూదులు మాత్రమే సైబీరియా చేరుకుంటారు. 2/3 వంతు యూదులు రైలు ఆగిన ప్రతి స్థలంలో అల్లరి మూలకల చేత చంపబడతారు. సైబీరియాకు చేరుకున్న యూదులు అక్కడి ప్రజలచే చంపబడతారు. అలా యూదులందరూ మార్చి 9వ తేదీన ఒక్కసారే హతమౌతారు. ఇదీ! అతని పన్నాగం.

స్టాలిన్ ఈ వివరాలన్నీ చదివి వినిపించాక ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. విన్నవారిలో ఒక్కరు కూడ ఔనని కాని కాదని కాని తమ ప్రతిస్పందనను తెలుపలేదు. దాంతో కోపోద్రేకుడైన స్టాలిన్ తన కాబినెట్ మినిస్టర్‌ను శపిస్తూ గదిలో నుండి దూసుకొని వెళ్ళిపోతూ దబాలున తలుపును మూసేసాడు. మార్చి రెండవ తేదీ అనగా తన ప్రణాళికను అందరికీ వివరించిన మరునాడే స్టాలిన్ గుండెపోటుతో మరణించాడు. వారం రోజులపాటు

భద్రం చేయబడిన అతని మృతదేహాన్ని సరిగ్గా మార్చి 9వ తేదీన, అనగా ఏరోజైతే తాను 30 లక్షల యూదుల్ని హతమార్చాలని కుట్ర పన్నాడో అదే రోజు సమాధి చేసారు. ఆ రోజు యూదులకు మరో పూరీము పండుగ అని చెప్పవచ్చు.

ప్రియ సోదరా! సోదరీ! అనాడు యూదులకే కాదు, ఈనాడు దేవుని ప్రజలైన క్రైస్తవులకు కూడా ఈలాంటి పరిస్థితులే ఎదురౌతున్నాయి. దానికి కారణం జాతి ద్వేషం. మతోన్మాదులు క్రైస్తవ్యాన్ని మట్టుపెట్టాలని మొదటి శతాబ్దం నుండి చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవడమే కాకుండ, రక్షణ సువార్త మరెక్కువ ప్రబలమై అనేకులు క్రీస్తును అంగీకరిస్తూనే ఉన్నారు. కాబట్టి క్రైస్తవులకు శ్రమలు, హింసలు, ఆటంకాలు ఎదురైనప్పుడు ఎస్తేరు గ్రంథంలోని విషయాలను జ్ఞాపకం చేసికోవాలి. ఈ క్రింది విషయాలను గమనించాలి. ధైర్యంగా ఉండాలి.

1. **దేవుని సార్వభౌమత్వము :** మనకు ఎదురయ్యే పరిస్థితులేవేగాని తలవని తలంపుగా లేక యాదృచ్ఛికంగా జరుగవు గాని, దేవుని ప్రణాళిక చొప్పుననే అనుమతించబడుతున్నాయి. దేవుడు ప్రతి ఒక్కరి జీవితాల మీద తన సర్వాధికారాన్ని కలిగి ఉన్నాడు. కాబట్టి ఆయన ఆధీనంలో ఉన్న మనకు ఎటువంటి ప్రతికూల పరిస్థితులెదురైనా, వాటినన్నింటిని తన స్వాధీనంలోనికి తీసికొని ఆయన చిత్తాన్ని నెవేరుస్తాడు. తన ప్రజల్ని సంరక్షిస్తాడు. ఆయన భద్రత, సంరక్షణను మన జీవితాల్లో పొందాలంటే మన జీవిత ఉద్దేశాలను ఆయన ఉద్దేశాలతో ఐక్యపరచాలి.
2. **విశ్వాసి పాత్ర :** దేవుని సార్వభౌమ ప్రణాళికను నెరవేర్చడంలో విశ్వాసి తన వంతు పాత్ర వహించినప్పుడే దేవుని ప్రజలకు విడుదల కలుగుతుంది. ప్రియ పాఠకులారా! మీ ప్రజలను రక్షించేందుకు మీకున్న అవకాశాలను, అనగా మీ స్థానం, మీకున్న స్థితిని వినియోగించేందుకు ఏమాత్రం వెనుకాడవద్దు. ఎస్తేరులా తెగింపుతో, ధైర్యంతో సాహసకార్యాలకు పూనుకొనేవారు ఈనాడు కూడ ఎంతో అవసరం. ఒకవేళ మీరు ఆలాంటి స్థానంలో లేకున్నా, ఆ స్థానంలో ఉన్నవారిని మొర్దెకైలా పురికొల్పాలి. నీతిమంతులు సింహం వలె ధైర్యంగా ఉండాలి. (సామె 28:1). అప్పుడే మన ద్వారా దేవుడు ఆ పరిస్థితులను తలక్రిందులుగా చేస్తాడు. గొప్పకార్యాలు చేస్తాడు. మనలో ప్రతి ఒక్కరము అలా దేవుని హస్తాలలో సాధనాలుగా వాడబడదాం. మన విశ్వాసాన్ని కాపాడుకొందాం. మన ప్రజల్ని రక్షించుకొందాం. దైవాశీస్సులు.

**TTB - Telugu - Study Outlines - The book of ESTHER**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**